సాక్షి
మహబూబాబాద్

మంగళవారం | 21 | జనవరి | 2025



రెండు కిలోమీటర్లు.. మూడున్నర గంటలు

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం హనుమకొండలో లక్ష డప్పులు.. వేల గొంతుకల సన్నాహక మహా ప్రదర్శన జరిగింది. - 8లో▸



కొండాయి బ్రిడ్జికి మోక్షమెప్పుడో?

కొండాయి జంపన్నవాగు బ్రిడ్జికి మోక్షం కలగడం లేదు. శంకుస్థాపన చేసి పది నెలలు పూర్తయినా ఇంకా పనులు ప్రారంభం కావడం లేదు. - 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
33.8^0/12.4^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం కాస్త ఎండగా ఉంటుంది. రాత్రివేళ చలితో పాటు మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి జిల్లా పోలీసుల క్రీడోత్సవాలు



మహబూబాబాద్ రూరల్: జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న జిల్లా పోలీస్ కార్యాలయ క్రీడా మైదానంలో ఈ నెల 21, 22, 23 తేదీల్లో వార్షిక క్రీడోత్సవాలు జరగనున్నాయి. ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ మంగళవారం ఉదయం క్రీడోత్సవాలను ప్రారంభించనున్నారు. క్రీడాంశాలన్నింటిలో పోటీలు నిర్వహించనుండగా పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొంటారు. 23న ముగింపు కార్యక్రమం ఏర్పాటు చేసి బహుమతులు అందజేయనున్నారు. ఇందులో భాగంగా సోమవారం వివిధ విభాగాల క్రీడాకారులు, పోటీల్లో పాల్గొనే వారికి ఎస్పీ క్రీడా దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో వివిధ విభాగాల డీఎస్పీలు శ్రీనివాస్, విజయప్రతాప్, మోహన్, ఆర్‌ఐలు అనిల్, భాస్కర్, సీఐలు చంద్రమౌళి, హతీరాం, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మమబూబాబాద్ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా కుట్టుమిషన్ యంత్రాల పంపిణీకి అర్హులైన మైనార్టీ క్రిస్టియన్ మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీశాఖ అధికారి శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 25 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చుసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 91825 40680, 95737 69507 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

రైతులపై కపట ప్రేమ

- మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్



మహబూబాబాద్ అర్బన్: బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో కేటీఆర్‌కు రైతుల ఆత్మహత్యలు కనపడలేదని, నేడు అధికారం పోయాక రైతులపై కపట ప్రేమ చూపిస్తూ రైతు ధర్నాలు చేయడం సిగ్గుచేటని మాజీ ఎంపీ, ప్రొఫెసర్ అజ్మీరా సీతారాంనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం సంవిధాన్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎర్రవల్లి ఫామ్‌హౌస్ చుట్టు ఉన్న గ్రామాల్లో రైతులు ఆత్మహత్య చేసుకున్నప్పుడు కేటీఆర్ ఎందుకు స్పందించలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఐదున్నర దశాబ్దాలు అధికారంలో ఉండి అంబేడ్కర్‌ను ఎప్పుడు కూడా గౌరవించలేదన్నారు. గాంధీ, నెహ్రూ కుటుంబాలు రాజ్యాంగాన్ని తుంగలో తొక్కాయని, నేడు రాహుల్‌గాంధీ రాజ్యాంగాన్ని రక్షించండి అంటూ రోడ్లపై తిరగడం విడ్డూరంగా ఉందన్నారు. బీజేపీ ఎంపీలు, నాయకులు ప్రధాని నరేంద్రమోదీని పార్లమెంట్‌లో విన్నవిస్తేనే నిజామాబాద్ రైతులకు పసుపుబోర్డు వచ్చిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శులు మురళి, వెంకన్న, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్రరావు, పట్టణ అధ్యక్షుడు వెన్నమల్ల అజయ్, మండల అధ్యక్షుడు జయేంద్రనాయక్, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



మహబూబాబాద్ అర్బన్: స్కూల్ బస్సు డ్రైవర్లు తప్పనిసరిగా రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలు పాటించాని జిల్లా రవాణా శాఖ అధికారి జైపాల్‌రెడ్డి అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాలు పురస్కరించుకొని సోమవారం జిల్లా కేంద్రంలోని ఏకశిల హోలీఏంజిల్స్ హైస్కూల్ బస్సు డ్రైవర్లను శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలు పక్కాగా పాటించాలన్నారు. ఇతర వాహనాలను ఓవర్ టేక్ చేయడంతో పాటు బస్సులను అతివేగంతో నడపడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. పిల్లలను జాగ్రతగా ఇంటికి చేర్చాలన్నారు. ప్రతీ స్కూల్ బస్‌లో ఫస్ట్ ఎయిడ్ మెడికల్ కిట్లు ఉండాలని, అగ్నిప్రమాద నివారణ పరికరాలు అందుబాటులో ఉంచాలన్నారు. ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డీఈఓ రవీందర్‌రెడ్డి, మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు వెంకట్‌రెడ్డి, పాఠశాలల ప్రిన్సిపాళ్లు రమేశ్‌రెడ్డి, కృష్ణమూర్తి, ట్రస్మా అధ్యక్షుడు మాల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిగిలింది ఐదు రోజులే..

ముగియనున్న మున్సిపల్ పాలకమండలి గడువు

- చివరి రోజుల్లో పనులు చక్కబెట్టుకునేందుకు కౌన్సిలర్ల ప్రయత్నాలు
- పెండింగ్ బిల్లుల కోసం ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణ
- కమిషనర్లపై కౌన్సిలర్ల ఒత్తిడి



మహబూబాబాద్ మున్సిపల్ కార్యాలయం

మున్సిపాలిటీల్లో వార్డులు, జనాభా వివరాలు

మున్సిపాలిటీ	వార్డులు	జనాభా
మహబూబాబాద్	36	68,889
తొర్రూరు	16	19,100
మరిపెడ	15	17,875
డోర్నకల్	15	14,425

సాక్షి, మహబూబాబాద్: మరో ఐదురోజుల్లో మున్సిపాలిటీల పాలక మండలి పదవీకాలం గడువు ముగుస్తుంది. అయితే దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకునే పనిలో పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు ఉన్నారు. చివరి నిమిషంలో తమ పనులు చేయాలని కొందరు కమిషనర్లపై ఒత్తిడి తేవడం, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో చెప్పిస్తున్నట్లు సమాచారం. అయితే కొందరు కమిషనర్లు చివరి నిమిషంలో పనులు చేసేందుకు సిద్ధం కాగా.. మరికొందరు మాత్రం ఆచితూచి అడుగులు వేస్తున్నట్లు తెలిసింది.

పెండింగ్ బిల్లులు చేయాలని..

జిల్లాలోని మహబూబాబాద్, తొర్రూరు, మరిపెడ, డోర్నకల్ మున్సిపాలిటీలకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక నిధులు మంజూరు చేశారు. అదే విధంగా మున్సిపల్ నిధులు, పబ్లిక్ హెల్త్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా చేపట్టిన పనులు కొన్నిచోట్ల పూర్తి కాగా.. మరికొన్ని చోట్ల అసంపూర్తిగా ఉన్నాయి. ఇందులో ఇప్పటికే కొన్ని బిల్లులు తీసుకోగా మరికొన్ని బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రధానంగా పట్టణ సుందరీకణ, బురదమయం అయిన వీధుల్లో మట్టి, మొరం పోసినవి, సీసీ రోడ్లు, సైడ్ కాల్వలు నిర్మించిన పనుల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటికి ఎంబీ చేసి నిధులు విడుదల చేయాలని కౌన్సిలర్లు మున్సిపల్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అయితే ఇందులో తొర్రూరు మున్సిపాలిటీలో పనుల బిల్లులు చేస్తుండగా మిగిలిన మున్సిపాలిటీల్లో మాత్రం అధికారులు స్పందించడం లేదని పలువురు కౌన్సిలర్లు వాపోతున్నారు.

ఆఖరి ప్రయత్నాలు

మున్సిపాలిటీల్లో కౌన్సిలర్లు, వారి అనుచరులు వార్డుల్లోని పెండింగ్ పనులు చివరి నిమిషంలోనైనా పూర్తి చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ప్రధానంగా మహబూబాబాద్, తొర్రూరు పట్టణాల్లో నూతన ఇళ్ల అనుమతుల కోసం వచ్చిన దరఖాస్తుల్లో బఫర్‌జోన్, ఇతర కారణాలతో కొన్ని ఫైల్స్ పెండింగ్‌లో పెట్టారు. అదే విధంగా అనుమతులు లేకుండా నిర్మించిన ఇళ్లు, ప్రభుత్వ స్థలాల్లో నిర్మించిన ఇళ్లకు ఇంటి నంబర్లు లేవు. అయితే నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఇంటి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలని, కొత్తగా నిర్మించిన ఇళ్లకు నంబర్లు ఇస్తామని పలువురు కౌన్సిలర్లు దరఖాస్తుదారుడి వద్ద అడ్వాన్స్ డబ్బులు తీసుకోవడం, పలుచోట్ల అనుమతులు ఇప్పిస్తామని బేరాలు కూడా చేసుకున్నట్లు సమాచారం. దీంతో చివరి రోజుల్లో ఈ పనులు చేసుకుంటే డబ్బులకు డబ్బులు, పేరుకు పేరు వస్తుందనే పనిలో పలువురు కౌన్సిలర్లు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. ఇందుకోసం కొందరు తమ గాడ్ ఫాదర్స్‌తో చెప్పించినట్లు సమాచారం. అయితే ఈ అనుమతులు, ఇంటి నంబర్ల కేటాయింపుపై అధికారులు ఏం చేస్తారో..అని పట్టణాల్లో చర్చ.

ఎలాంటి అనుమతులూ ఇవ్వడం లేదు



మున్సిపాలిటీ పాలక మండలి పదవీకాలం ఈనెల 26తో ముగియనుంది. అయితే రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు సర్వేలో బిజీగా ఉన్నాం. ఇప్పుడు ఆ పని తప్ప వేరే పని చేసే పరిస్థితి లేదు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఇళ్లకు అనుమతులు ఇవ్వం. అనుమతులు లేకుండా నిర్మించిన ఇళ్లకు నంబర్లు ఇవ్వడం లేదు.

– రవీందర్, మున్సిపల్ కమిషనర్, మహబూబాబాద్

బోసిపోయిన చిరునవ్వులు

లోకం పోకడలు తెలియని పాలబుగ్గల చిన్నోడి చిరునవ్వులు బోసిపోయాయి. వెచ్చని తల్లిఒడిలో జోలపాట వినాల్సిన వయసులో.. నిండు నూరేళ్లు నిండాయి. వీధిలో ఆడుకుంటూ.. ఎడ్లబండి చక్రం కింద నలిగిపోయాడు. అల్లారుముద్దుగా పెంచుకుంటున్న తల్లిదండ్రులకు పుత్రశోకం మిగిలింది. గుండెలవిసేలా విలపించిన వారిని ఓదార్చడం ఎవరివల్ల కాలేదు. వారి రోదనలు చూసి బంధుమిత్రులు కన్నీటిపర్యంతమయ్యారు.

ఎడ్ల బండి చక్రాల కింద పడిన బాలుడు

- చికిత్స పొందుతూ మృతి
- గుర్రప్పతండాలో విషాదఛాయలు



బాలుడి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు



ప్రణయ్ తేజ్ (ఫైల్)

మరిపెడ రూరల్: మరిపెడ మండలం ఎడ్జెర్ల గ్రామ రెవెన్యూ పరిధిలోని గుర్రప్పతండాకు చెందిన బానోతు లచ్యా, సునీత దంపతుల కుమారుడు బానోతు ప్రణయ్ తేజ్ (4) ఆదివారం వీధిలో ఆడుకుంటున్నాడు. ఈక్రమంలో ఇంటి పక్కన ఉండే హాళావత్ సిరి ఎడ్ల బండి వ్యవసాయ క్షేత్రానికి వెళ్తూ బాలుడు ఆడుకుంటున్న వీధి వద్దకు వచ్చి ఆగింది. ఈక్రమంలో బాలుడు చక్రం మీదుగా ఎండ్ల బండి ఎక్కడానికి ప్రయత్నించాడు. బండి ఒక్కసారిగా ముందుకు కదలడంతో బాలుడు చక్రం కింద పడ్డాడు. ఈక్రమంలో చక్రం అతడిపై నుంచి వెళ్లింది. గాయపడిన బాలుడిని చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. దీంతో తల్లిదండ్రులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. బాలుడి మృతితో తండాలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కాగా ప్రణయ్ తేజ్ మరిపెడలోని రత్న స్కూల్‌లో నర్సరీ చదువుతున్నాడు. మరిపెడ ఏఎస్సై మంగ్యానాయక్ సిబ్బందితో సంఘటన స్థలికి చేరుకొని పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం బాలుడి మృతదేహాన్ని మహబూబాబాద్‌లోని జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

షెడ్యూల్ ప్రకారం గ్రామసభలు నిర్వహించాలి

- లబ్ధిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియ
- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

మహబూబాబాద్: జిల్లాలో ఈనెల 21నుంచి 24వరకు షెడ్యూల్ ప్రకారం గ్రామ సభలు నిర్వహించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో సోమవారం గ్రామసభల నిర్వహణపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ సభలకు విస్తృత ఏర్పాట్లు చేయాలన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పథకాల అమలులో అధికారులందరూ అంకితభావంతో పనిచేయాలన్నారు. గ్రామసభల విషయంలో అధికారులు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామ సభల్లో ఫ్లెక్సీలు, మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల నోటీస్ బోర్డుపై అర్హుల జాబితాను ఏర్పాటు చేయాలన్నారు. గ్రామ సభల్లో వచ్చే ఫిర్యాదులను రిజిస్టర్లలో నమోదు చేసుకొని స్వీకరించాలన్నారు. గ్రామ సభల తీర్మాన పత్రాలను సురక్షితంగా ఎంతో జాగ్రత్తగా భద్రపర్చాలన్నారు. లబ్ధిదారులు ఎంపిక అనేది నిరంతర ప్రక్రియ అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పో, వీరబహ్మాచారి, జెడ్పీ సీఈఓ పురుషోత్తం, డీపీఓ హరిప్రసాద్, డీఎస్ఓ ప్రేమ్‌కుమార్, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించాలి

గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పో, వీరబ్రహ్మాచారితో కలిసి కలెక్టర్ వేడుకల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో వేడుకలకు తగిన ఏర్పాటు చేయాలన్నారు. మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు.

అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలి

మరిపెడ: అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. మరిపెడ మున్సిపాలిటీలోని పలు వార్డులు, ట్రైబల్ వెల్ఫేర్ వసతి గృహాలను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పలు వార్డుల్లో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. అందుకు ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం డ్రెయినేజీలను పరిశీలించారు. అన్ని ప్రాంతాల్లో పారిశుద్ధ్యం మెరుగ్గా ఉండేలా చూడాలని చెప్పారు. తహసీల్దార్ సైదులు, మున్సిపల్ కమిషనర్ నరేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నిధులు విడుదల..

ఫిబ్రవరి 3నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

- ఫస్టియర్‌లో 1199 మంది విద్యార్థులు
- సెకండియర్‌లో 3,342మంది
- మార్చి 5 నుంచి వార్షిక పరీక్షలు



మహబూబాబాద్ అర్బన్: ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షల షెడ్యూల్ విడుదల చేశారు. ఫిబ్రవరి 3వ తేదీ నుంచి ప్రాక్టికల్ పరీక్షలు జరగనున్నారు. సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ మార్కులు కూడా చాలా ముఖ్యం. కాగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రాక్టికల్స్ నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఈ నిధులతో కెమిస్ట్రీ, బయాలజీ, ఫిజిక్స్ సబ్జెక్ట్‌లకు సంబంధించిన కెమికల్స్, పలు రకాల సామగ్రి కొనుగోలు చేయనున్నారు.

ఒక్కో కళాశాలకు రూ.25వేలు..

ఒక్కో ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు రూ.25వేల చొప్పున కళాశాల ఖాతాల్లో జమ చేశారు. ప్రయోగాలకు సంబంధించిన రసాయనాలు ఇతర సామగ్రి కొనుగోలు చేసి విద్యార్థులతో ప్రాక్టికల్స్ సక్రమంగా చేయించాలి. ఫిబ్రవరి 3నుంచి 25వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు కొనసాగుతాయి. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లో కూడా ప్రాక్టికల్స్ ఉంటాయి. అనంతరం నైతిక, మానవీయ విలువలు, పర్యావరణం పరీక్షలు ఉంటాయి. మార్చి 5నుంచి 22వరకు వార్షిక పరీక్షలు నిర్వహించనున్నారు.

ప్రాక్టికల్ పరీక్షకు హాజరుకానున్న 4,541మంది..

ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయి. ఇందులో మొత్తం 3,342 మంది విద్యార్థులు హాజరవుతారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో 2305 మంది, ఒకేషనల్‌లో 1037మంది హాజరవుతారు. అలాగే ఒకేషనల్ మొదటి సంవత్సరం విద్యార్థులు 1199 మంది ప్రయోగ పరీక్షలకు హాజరుకానున్నారు. జనరల్ ప్రాక్టికల్స్‌కు 30 పరీక్ష కేంద్రాలు, ఒకేషనల్ పరీక్షలకు 16 కేంద్రాల్లో ఏర్పాట్లు చేస్తారు. మొదటి సెషన్ ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు జరుగుతాయి.

నిధులు ఖర్చు చేస్తారా..

జిల్లాలోని 10 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు ప్రాక్టికల్ పరీక్షల కోసం నిధులు విడుదలయ్యాయి. ఈ నిధులతో ప్రయోగ రసాయనాలు, సీసీ కెమెరాలు, ఇతర సామగ్రి కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అయితే ఈ నిధులను ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాళ్లు, సైన్స్ అధ్యాపకులు సక్రమంగా ఖర్చు చేస్తారా లేదా అని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

గైర్హాజరైతే ఫెయిల్ అయినట్లే..



ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు రాసే విద్యార్థులు హాల్ టికెట్‌లో ఉన్న సమయానికి 30 నిమిషాల ముందే కేంద్రాలకు చేరుకోవాలి. ఈ పరీక్షలకు గైర్హాజరైన విద్యార్థులు ఫెయిల్ అయినట్టే. విద్యార్థులకు తమ కళాశాల ఉపాధ్యాయులు ఒకటికి రెండు సార్లు చెప్పాలి. నిమిషం ఆలస్యం వస్తే విద్యార్థులకు అనుమతి లేదు.

– సీహెచ్.మదార్‌గౌడ్, డీఐఈఓ

నేడు 'డయల్ యువర్ డీఎం'

తొర్రూరు: తొర్రూరు బస్ డిపో పరిధిలో నేడు (మంగళవారం) ఉదయం 11నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎం పద్మావతి తెలిపారు. వివిధ మార్గాల్లో కొత్త బస్సు సర్వీసుల కేటాయింపు, వేళల్లో మార్పులు, ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రయాణ ప్రాంగణాల్లో సమస్యలు, సంస్థ ఉన్నతికి చేపట్టాల్సిన చర్యలపై ప్రజలు నేరుగా తమ సూచనలు, సలహాలు ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకురావచ్చన్నారు. ఆసక్తిగలవారు 9959226053 ఫోన్ నంబర్‌లో నిర్ణీత సమయంలో ఫోన్ చేయవచ్చని తెలిపారు.

వృద్ధులు, దివ్యాంగుల తిప్పలు

జిల్లా కేంద్రంలోని గిరిజన భవన్‌లో సోమవారం ప్రత్యేక ఉపకరణాల ఎంపిక కోసం క్యాంపు నిర్వహించగా.. వందల సంఖ్యలో వృద్ధులు, దివ్యాంగులు హాజరయ్యారు. ఆర్టిఫిషియల్ లింబ్ మ్యానుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపునకు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వృద్ధులు, దివ్యాంగులు తగిన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడ్డారు. భవనం లోపలికి వెళ్లేందుకు సరిపడా వీల్‌చైర్లు లేవు. దీంతో వెంటవచ్చిన వారు దివ్యాంగులను మోసుకెళ్లారు. ఎలాగోలా లోపలికి వెళ్ల దరఖాస్తులు అందజేశారు.

–సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, మహబూబాబాద్



దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్న సిబ్బంది









ఇబ్బందులు పడుతూ వస్తున్న దివ్యాంగులు

ఎడ్జెర్ల స్కూల్‌కు తాళం వేస్తా..

- కాంట్రాక్టర్ శాణం నారాయణ
- డీఈఓ రవీందర్‌రెడ్డికి ఫిర్యాదు

మరిపెడ రూరల్: పాఠశాల అభివృద్ధి పనులు చేపట్టినప్పటికీ పెండింగ్ బిల్లులు చెల్లించడంతో అలసత్వం అవుతుందని, ఎడ్జెర్ల యూపీఎస్‌కు తాళం వేస్తానని కాంట్రాక్టర్ శాణం నారాయణ హెచ్చరించాడు. ఈ మేరకు సోమవారం డీఈఓ రవీందర్‌రెడ్డికి ఫిర్యాదు చేశాడు. అనంతరం బాధితుడు నారాయణ మాట్లాడుతూ.. అమ్మ ఆదర్శ పాఠశాలల కింద ఎడ్జెర్ల యూపీఎస్‌కు రూ.6.20 లక్షలు మంజూరు కాగా, పాఠశాలలో అభివృద్ధి పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. బిల్లులో 2.17 లక్షలు చెల్లించి.. మిగిలి రూ.4 లక్షలు 8 నెలలు కావొస్తున్న చెల్లించడం లేదని వాపోయాడు. తెచ్చిన అప్పులకు మిత్తి పెరుగుతోందని, పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించాలని, లేని క్రమంలో పాఠశాలకు తాళం వేస్తానని నారాయణ హెచ్చరించాడు. ఇదే విషయంపై మరిపెడ ఎంపీడీఓ విజయకు ఫిర్యాదు చేయడానికి వెళ్తే తనపై ఆగ్రహం వ్యక్తం చేశారని బాధితుడు వాపోయాడు.

ఆదివాసీ చట్టాలను అమలు చేయాలని ధర్నా

ఏటూరునాగారం: భారత రాజ్యాంగం ఆదివాసీలకు కల్పించిన చట్టాలను అమలు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పూనెం శ్రీనివాస్, నాయకులు ఉయిక శంకర్, ధనసరి రాజేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏటూరునాగారం మండల కేంద్రంలోని వైజంక్షన్ వద్ద కొమురం భీం విగ్రహం నుంచి ఐటీడీఏ వరకు ఆదివాసీలు సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఐటీడీఏ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .. 1/70 చట్టం అమలు చేయడంలో అధికారులు నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారన్నారు. నీటి సౌకర్యం లేని ఆదివాసీ భూములకు పంట బోర్లు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఆదివాసీ హక్కులు చట్టాలు పటిష్ఠంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. తుర్స కృష్ణబాబు, తాటి రాంబాబు, పాయం భారతి, లొడిగె నర్సింహారావు, కుర్సం శివశంకర్, సురేష్, గోపి, అర్జున్, చంటి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలి



ప్రచారం చేస్తున్న పింగిళి శ్రీపాల్‌రెడ్డి తదితరులు

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పీఆర్‌టీయూ అభ్యర్థి పింగిళి శ్రీపాల్‌రెడ్డి

మహబూబాబాద్ అర్బన్: నల్లగొండ-వరంగల్-ఖమ్మం నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి తనను గెలిపించాలని పీఆర్‌టీయూ అభ్యర్థి పింగిళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పలు వార్డుల్లో సోమవారం రాత్రి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికలో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. ఐదు డీఏ బకాయిలను ఇప్పించే బాధ్యత తమదని, సీపీఎస్ రద్దు, 317జీవోపై సుదీర్ఘ పోరాటం చేయడంతో నేడు బదిలీలు కొనసాగుతున్నాయన్నారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సంకా బద్రినారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి మిర్యాల సతీష్‌రెడ్డి, నాయకులు క్లోం వెంకట్‌రెడ్డి, గీత, హల్యానాయక్, రామోజీనాయక్, సుజాత, కీర్తనరెడ్డి, చిట్టిబాబు, భవాని, సరిత, నాగరాజు పాల్గొన్నారు.

బాల కార్మికులను ఇంటికి పంపిస్తాం

- త్వరలోనే నూతన సీడబ్ల్యూసీ ఏర్పాటు
- విచారణ చేపట్టిన డీడబ్ల్యూఓ దనమ్మ



విచారణ చేస్తున్న జిల్లా సంక్షేమాధికారి దనమ్మ

సాక్షి ఎఫెక్ట్

మహబూబాబాద్: బాలసదనంలో ఉన్న బాలకార్మికులను ఇంటికి పంపిస్తామని జిల్లా సంక్షేమాధికారి దనమ్మ అన్నారు. సీడబ్ల్యూసీ నిర్వాకంతో బాలసదనంలో నెలల తరబడి బాలకార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈమేరకు సోమవారం సాక్షి దినపత్రికలో 'సమన్వయం లోపం!' అనే శీర్షికన వెలువడిన కథనంపై జిల్లా సంక్షేమాధికారి దనమ్మ స్పందించారు. ఈమేరకు జిల్లా సంక్షేమాధికారి కార్యాలయంలో డీడబ్ల్యూఓ దనమ్మ అధ్యక్షతన సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ డాక్టర్ నాగవాణి, సభ్యులు డేవిడ్, డాక్టర్ పరికిపండ్ల అశోక్, బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్‌లైన్ విభాగం అధికారులతో సమావేశం నిర్వహించారు. డీడబ్ల్యూఓ కొన్ని గంటల పాటు విచారణ చేశారు. వారినుంచి నివేదికలు తీసుకున్నట్లు సమాచారం. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీడబ్ల్యూసీ కమిటీ మూడేళ్ల పదవీకాలం కూడా ముగిసిందని, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి నూతన కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రాజు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ పురుగు మందులు విక్రయించారని ఆందోళన



దోర్నకల్‌ : తమకు నకిలీ పురుగు మందులు విక్రయించారని ఆరోపిస్తూ డోర్నకల్‌ మండలం చిలుకోడు గ్రామంలో రైతులు సోమవారం ఆందోళన నిర్వహించారు. మిరప తోటల్లో నల్లతామర, ఎర్ర నల్లి నివారణకు చిలుకోడు గ్రామంలోని కృష్ణా ట్రేడర్స్‌ దుకాణంలో 'ఎండోఫిల్‌ అలక్టో' మందు కొనుగోలు చేసి పిచికారీ చేస్తే పనిచేయలేదని, ఫలితంగా పంట నష్టపోయామని పలు గ్రామాలకు చెందిన రైతులు పేర్కొన్నారు. ఈ ఘటనపై తమకు పరిహారం చెల్లించి న్యాయం చేయాలంటూ కంపెనీ డీలర్‌ నాగరాజును నిలదీశారు. సమాచారం అందుకున్న ఏఓ మురళీమోహన్‌, డోర్నకల్‌, బయ్యారం సీఐలు బి.రాజేశ్‌, రవికుమార్‌, ఏఎస్సై కోటేశ్వర్‌రావు చిలుకోడుకు చేరుకుని రైతులతో మాట్లాడి సర్ది చెప్పారు. ఎండోఫిల్‌ కంపెనీ ఏఎఫ్‌ఓ తిరుపతి మాట్లాడుతూ ఒక బ్యాచ్‌కు చెందిన 'అలక్టో' మందులో తేడా ఉన్నట్లు గుర్తించామని, దీనిని కంపెనీ దృష్టికి తీసుకెళ్తామన్నారు. అధికారులు మాట్లాడుతూ పూర్తి స్థాయి విచారణ జరిపి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

చిన్నారిపై లైంగిక దాడి

- యువకుడిపై పోక్సో కేసు

రఘునాథపల్లి: మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఆరేళ్ల చిన్నారిపై మద్యం మత్తులో ఓ యువకుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆదివారం సెలవు దినం కావడంతో ఇంటి వద్ద ఉన్న చిన్నారిపై ఇంట్లో ఎవరూ లేని సమయంలో అదే గ్రామానికి చెందిన యువకుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న చిన్నారి తల్లిదండ్రులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు సోమవారం యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

శంకుస్థాపన చేసి పది నెలలు పూర్తి.. ప్రారంభంకాని నిర్మాణ పనులు

- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- మళ్లీ వరద తిప్పలు తప్పవంటున్న ప్రజలు
- పనులకు సంబంధించిన శిలాఫలకం ధ్వంసం

కొండాయి బ్రిడ్జికి మోక్షమెప్పుడో?


కూలిపోయిన కొండాయి బ్రిడ్జి

ఏటూరునాగారం: కొండాయి జంపన్న వాగు బ్రిడ్జి నిర్మాణానికి మోక్షం కలగడం లేదు. శంకుస్థాపన చేసి పది నెలలు పూర్తయినా ఇంకా పనులు ప్రారంభంకావడం లేదు. దీంతో మళ్లీ వరద తిప్పలు తప్పవని ఏజెన్సీ ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఏజెన్సీలో కురిసిన భారీ వర్షాలకు 2023 జూలై 27వ తేదీన మండలంలోని కొండాయి, మల్యాల గ్రామాలు వరదలో మునిగిపోయాయి. ఇదేక్రమంలో కొండాయి–దొడ్ల గ్రామాల మధ్యలోని హైలెవల్‌ బ్రిడ్జి కొట్టుకుపోయింది. ఈ ఘటనలో 8 మంది వరదలో చిక్కుకుని మృతి చెందారు. ఈ క్రమంలో రాష్ట్రంలో కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చిన తర్వాత కొండాయి, లోతట్టు గ్రామాల ప్రజలు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా హైలెవల్‌ బ్రిడ్జి నిర్మించాలని పలువురు అధికారులు, మంత్రులు, ప్రజాప్రతినిధులను వేడుకున్నారు. దీంతో రాష్ట్ర పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి సీతక్క గతేడాది మార్చి 16వ తేదీన రూ.9.50కోట్లతో హైలెవల్‌ బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అయితే శంకుస్థాపన చేసి పది నెలలు పూర్తయినా పనుల్లో ఎలాంటి కదలికలు లేవు. ఇదిలా ఉండగా ఈ వాగుపై తాత్కాలిక రోడ్డు నిర్మించారు. అయితే ఐదు నెలలు దాటితే వర్షాకాలం కూడా ప్రారంభం కానున్న నేపథ్యంలో మళ్లీ వర్షాలు కురిసి ప్రస్తుత తాత్కాలిక మట్టి రోడ్డు కొట్టుకుపోయే అవకాశాలున్నాయి. ఫలితంగా గిరిజన పల్లెలకు కష్టాలు తప్పేలా లేవని పలువురు పేర్కొంటున్నారు. అంతేకాకుండా ఈ బ్రిడ్జి నిర్మాణం జరిగితే కొండాయి, మల్యాలతోపాటు ఐలాపురం గ్రామస్తులకు కూడా మెరుగైన రవాణా సౌకర్యం కలుగుతుంది. కాగా, బ్రిడ్జి నిర్మాణ పనులకు సంబంధించిన శిలాఫలకం ధ్వంసమైంది. పనుల్లో ఎలాంటి కదలికలు లేవని ఉద్దేశంతో దీనిని ధ్వంసం చేశారా లేక యాదృచ్ఛికంగా జరిగిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మినీ జాతరకు ఈ రోడ్డేనా?

ఫిబ్రవరిలో జరిగే మేడారం సమ్మక్క, సారలమ్మ మినీ జాతరకు ఈ మట్టి రోడ్డే దిక్కయ్యేలా ఉంది. మేడారంతోపాటు ఐలాపురం, కొండాయిలో జరిగే సమ్మక్క, సారలమ్మ జాతరకు ఛత్తీస్‌గఢ్‌, మహారాష్ట్ర, ఇతర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ప్రైవేటు వాహనాలు వస్తాయి. దీంతో వాహనదారులకు మట్టి రోడ్డుతో సమస్యలు, ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలు అధికంగా ఉన్నాయి. సింగిల్‌ లేన్‌గా ఉన్న మట్టి రోడ్డు వల్ల వాహనాలు ఎదురైతే వాగులో పడిపోయే అవకాశాలు ఎక్కువ ఉన్నాయి. దీనిపై రోడ్డు భవనాల శాఖ, పంచాయతీరాజ్‌, ఐటీడీఏ గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్‌ అధికారులు దృష్టిసారించాలని పలువురు ఏజెన్సీ వాసులు పేర్కొంటున్నారు.



కొండాయి బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించాలి

కొండాయి వద్ద కూలిపోయిన బ్రిడ్జి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలి. బ్రిడ్జి లేకపోవడంతో ప్రమాదకర ప్రయాణాలు చేయాల్సి వస్తోంది. వాహనదారులు, ఉద్యోగులు, రైతులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దీనిని దృష్టిలోకి ఉంచుకుని వెంటనే బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించాలి.

-మల్లెల లక్ష్మయ్య, మాజీ సర్పంచ్‌, ఐలాపురం



జాతర కోసం రోడ్లు అభివృద్ధి చేయాలి

కొండాయి, ఐలాపురం రోడ్లు మరింత అభివృద్ధి చేయాలి. మినీ మేడారం జాతరతోపాటు కొండాయి, ఐలాపురంలో కూడా జాతర జరుగుతుంది. ఈనేపథ్యంలో భక్తుల కోసం రోడ్లు మరింత అభివృద్ధి చేయాలి.

-కాక వెంకటేశ్వర్లు , మాజీ సర్పంచ్‌

రాష్ట్రంలోనే నంబర్‌వన్‌గా డీసీసీబీ


దశాబ్ది డిపాజిట్‌ పథక కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న డీసీసీబీ చైర్మన్‌ రవీందర్‌ రావు, డైరెక్టర్లు

- రూ.2,100 కోట్ల టర్నోవర్‌తో అగ్రస్థానం
- డీసీసీబీ చైర్మన్‌ మార్నేని రవీందర్‌ రావు

హన్మకొండ : రాష్ట్రంలోనే వరంగల్‌ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) నంబర్‌ వన్‌గా ఉందని ఆ బ్యాంకు చైర్మన్‌, తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్‌ అపెక్స్‌ బ్యాంకు చైర్మన్‌ మార్నేని రవీందర్‌ రావు పేర్కొన్నారు. సోమవారం నక్కలగుట్టలోని ప్రధాన కార్యాలయంలో డీసీసీబీ మహాజన సభ జరిగింది. ఈ సభలో చైర్మన్‌ రవీందర్‌ రావు మాట్లాడారు. పాలకవర్గం బాధ్యతలు చేపట్టినప్పుడు రూ.885 కోట్ల టర్నోవర్‌..ఇప్పుడు రూ.2,100 కోట్లకు చేరుకుందని వివరించారు. పంట రుణాలు రూ.372 కోట్ల నుంచి రూ.600 కోట్లకు, ఎల్‌టీ రుణాలు రూ.150 కోట్ల నుంచి రూ.342 కోట్లకు పెరిగాయని వెల్లడించారు. సెల్ఫ్‌హెల్ప్‌ గ్రూపులకు రుణాలు ఇచ్చే కార్యక్రమాన్ని చేపట్టి రూ.118 కోట్ల రుణాలు ఇచ్చామన్నారు. నాబార్డు సాయంతో 50 ప్రాథమిక సహకార సంఘాలను మల్టీపర్పస్‌ సర్వీస్‌ సెంటర్లుగా అభివృద్ధి చేశామన్నారు. రైతుల పిల్లలు విదేశీ విద్య అభ్యసించేందుకు రుణాలు అందించామని వివరించారు. ప్రతీ మండలంలో డీసీసీబీ బ్రాంచీ ఏర్పాటుకు రిజర్వు బ్యాంకుకు ప్రతిపాదనలు పంపామన్నారు. రాష్ట్రంలోనే వరంగల్‌ డీసీసీబీ ఏ–గ్రేడ్‌ సర్టిఫికెట్‌ అందుకుందన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ దశాబ్ది డిపాజిట్‌ పథకాన్ని ప్రవేశపెట్టి కరపత్రాలు ఆవిష్కరించారు.

నల్లవెల్లి కన్‌స్ట్రక్షన్స్‌కు వడ్డీతో ఖర్చుల చెల్లింపు

డీసీసీబీలో ఖాళీగా ఉన్న భవన సముదాయాన్ని అద్దెకు ఇచ్చిన అంశంలో కొంత ఉపశమనం లభించింది. అసంపూర్తిగా ఉన్న భవనాన్ని పూర్తి చేసినందుకు అయిన ఖర్చులను వడ్డీతో సహా చెల్లించాలని కోర్టు ఇచ్చిన తీర్పు మేరకు డీసీసీబీ పాలక వర్గం ఏడుగురు డైరెక్టర్లతో ప్రత్యేక కమిటీ వేసింది. నల్లవెల్లి కన్‌స్ట్రక్షన్స్‌కు రెండు వాయిదాలో మొత్తం రూ.3,23,93,099 డీసీసీబీ చెల్లించాలని కమిటీ నిర్ణయం తీసుకుంది. ఈ తీర్మానాన్ని సోమవారం వరంగల్‌ డీసీసీబీ మహాజన సభలో ప్రవేశపెట్టగా సభ ఆమోదం తెలిపింది.

అధికారుల తీరుపై ఆగ్రహం..

జిల్లా సహకార అధికారుల తీరుపై డీసీసీబీ డైరెక్టర్లు, సంఘాల చైర్మన్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరో చెప్పారని తమపై కక్షసాధింపు, కుట్రలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. రైతులకు సహకరించి ధాన్యం తరలిస్తే రవాణా ఖర్చులు ఎలా చూపెడతారని జిల్లా సహకార అధికారి తమపై చర్యలు తీసుకోవాలని చూస్తున్నారని డీసీసీబీ డైరెక్టర్‌, తొర్రూరు పీఏసీఎస్‌ చైర్మన్‌ కాకిరాల హరిప్రసాద్‌ మండిపడ్డారు. మరో డైరెక్టర్‌ చెట్టుపల్లి మురళీధర్‌ తమ సొసైటీపై కుట్రలకు పాల్పడుతున్నారని, నాచినపల్లి సొసైటీపై చర్యలు తీసుకుంటే కోర్టుకు వెళ్తామని వరంగల్‌ డీసీఓ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరికి ఇతర సంఘాల చైర్మన్లు మద్దతు తెలిపారు. ఈ సమావేశంలో డీసీసీబీ సీఈఓ ఎండీ వజీర్‌ సుల్తాన్‌, జిల్లా సహకార అధికారులు, డీసీసీబీ డైరెక్టర్లు, సహకార సంఘాల చైర్మన్లు పాల్గొన్నారు.

శుభకార్యానికి వెళ్తూ మృత్యుఒడికి..

- అదుపు తప్పి పల్టీకొట్టిన కారు.. విద్యార్థి మృతి
- ఒకరికి తీవ్ర, నలుగురికి స్వల్ప గాయాలు
- పెంబర్తి వై జంక్షన్‌ సమీపంలో ఘటన

జనగామ : స్నేహితుడి ఇంట్లో జరుగుతున్న శుభకార్యానికి ఆరుగురు విద్యార్థులు కారులో బయలుదేరారు. ఈ క్రమంలో మార్గమధ్యలో కారు అదుపు తప్పి పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో ఓ విద్యార్థి మృత్యుఒడికి చేరగా, ఒకరికి తీవ్ర, నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం తెల్లవారుజామున జనగామ జిల్లా పెంబర్తి వై జంక్షన్‌ సమీపంలో వరంగల్‌–హైదరాబాద్‌ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి కరీంనగర్‌ జిల్లా కేశవపట్నం మండలం ఆముదాపల్లికి చెందిన విద్యార్థి పెద్దపల్లి అభిచరణ్‌, పోలీసుల కథనం ప్రకారం.. ఆముదాలపల్లికి చెందిన పెద్దపల్లి అభిచరణ్‌, కరీంనగర్‌ జిల్లా సైదాపూర్‌ మండలం వెన్నెంపల్లికి చెందిన బండ గణేశ్‌, ఇదే జిల్లా మెట్‌పల్లికి చెందిన తోట అక్షిత్‌, బహదూర్‌పురా మండలం అంబర్‌పల్లికి చెందిన గుజ్జుల నందు, కరీంనగర్‌ జిల్లా వీణవంక మండలం మల్లన్నపల్లెకు చెందిన కన్నివేని అంజి, జయశంకర్‌ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం కురికిశాల గ్రామానికి చెందిన బద్దం సిద్ధారెడ్డి(20) స్నేహితులు. ఇందులో సిద్ధారెడ్డి హనుమకొండలోని వాగ్దేవి, మిగతా వారు వివిధ కళాశాలల్లో చదువుకుంటున్నారు. హైదరాబాద్‌లోని తమ స్నేహితుడి ఇంట్లో జరిగే శుభకార్యానికి ఆరుగురు ఆదివారం అర్ధరాత్రి కారులో బయలుదేరారు. ఈ క్రమంలో జనగామ మండలం పెంబర్తి వై జంక్షన్‌ సమీపంలో కారు అదుపు రోడ్డు పక్కన గుంతలోకి పల్టీలు కొట్టింది. దీంతో కారు డోర్‌ ఊడిపోవడంతో


పల్టీకొట్టిన కారు


సిద్ధారెడ్డి(ఫైల్‌)

సిద్ధారెడ్డి బయటకు ఎగిరి పడగా అంజికి తీవ్రగాయాలయ్యాయి. మిగతా నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. అక్షిత్‌ వెంటనే 108 అంబులెన్స్‌కు ఫోన్‌ చేశారు. క్షతగాత్రులను జిల్లా ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రికి తరలించగా, సిద్ధారెడ్డి మార్గమధ్యలోనే మృతి చెందాడు. అంజి పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్‌కు తరలించారు. ఎస్సై రాజన్‌బాబు ఘటనా స్థలికి చేరుకుని దర్యాప్తు చేశారు.

శోకసంద్రంలో కుటుంబ సభ్యులు

కారు ప్రమాద ఘటన తెలుసుకున్న వెంటనే మృతుడి కుటుంబ సభ్యులు జనగామ జిల్లా ఆస్పత్రికి చేరుకున్నారు. జయశంకర్‌ భూపాలపల్లి జిల్లాకు చెందిన మహేందర్‌రెడ్డి, లావణ్య దంపతులకు సిద్ధారెడ్డితో పాటు కూతురు ఉంది. సిద్ధారెడ్డిని హనుమకొండ వాగ్దేవి డిగ్రీ కళాశాలలో చదివిస్తున్నారు. ఈ క్రమంలో రోడ్డు ప్రమాదంలో సిద్ధారెడ్డి మృతి చెందడంతో కొడుకుపైనే ఆశలుపెట్టుకున్న ఆ తల్లిదండ్రులు దుఃఖసాగరంలో మునిగారు. కుమారుడి మృతదేహం మీద పడి గుండెలవిసేలా రోదించారు. సిద్ధారెడ్డి మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి చేసిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అదుపు తప్పి ట్రాక్టర్‌ బోల్తా..

- డ్రైవర్‌ మృతి.. మొట్లగూడెంలో ఘటన
- మృతుడిది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

మంగపేట : అదుపు తప్పి ట్రాక్టర్‌ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈఘటన ఆదివారం రాత్రి ములుగు జిల్లా మంగపేట మండలం మొట్లగూడెం సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు, మృతుడి కుటుంబీకుల కథనం ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం ముత్యాలమ్మపేటకు చెందిన ప్రశాంత్‌ (25) ములుగు జిల్లా మంగపేట మండలం నర్సింహాసాగర్‌ గ్రామంలోని రైతు తాటి సమ్మయ్యకు చెందిన జామాయిల్‌ కలప ను ట్రాక్టర్‌లో లోడ్‌ చేసుకుని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సారపాక ఐటీసీ పీఎస్‌పీడీ ఫ్యాక్టరీకి వెళ్తున్నాడు. మొట్లగూడెం సమీపంలో ట్రాక్టర్‌ అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో ప్రశాంత్‌ ట్రాక్టర్‌ స్టీరింగ్‌ మధ్యలో ఇరుక్కుని అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు ఎస్సై టీవీఆర్‌ సూరి ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం సోమవారం మృతదేహాన్ని ఏటూరునాగారం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తాత రామయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి తల్లి నాగమణి, తమ్ముడు రాంపండు ఉన్నారు.


ప్రశాంత్‌ మృతదేహం

బస్సుల్లో చోరీలకు పాల్పడుతున్న దంపతుల అరెస్ట్‌

- రూ.8.50 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

వరంగల్‌ క్రైం : ఆర్టీసీ బస్సుల్లో చోరీలకు పాల్పడుతున్న దంపతులను అరెస్ట్‌ చేసినట్లు హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి తెలిపారు. వీరినుంచి సుమారు రూ.8.50 లక్షల విలువైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. సోమవారం హనుమకొండ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల అరెస్ట్‌ చూపి వివరాలు వెల్లడించారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాటారం గ్రామానికి చెందిన దంపతులు మద్దూరి సత్యనారాయణ, చెల్ల స్వప్న హనుమకొండ కుమార్‌పల్లిలో నివాసం ఉంటున్నారు. సత్యనారాయణ కుల వృత్తి చేస్తుండగా, స్వప్న ఇంటి వద్దే ఉంటుంది. సత్యనారాయణకు వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఆర్టీసీ బస్సులో చోరీలకు పాల్పడుతున్నారు. ఇందులో భాగంగా గతేడాది హనుమకొండ బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న మహిళ, వృద్ధురాలి మెడలోని బంగారు ఆభరాణాలను స్వప్న చోరీ చేసి భర్తకు అందజేసింది. డిసెంబర్‌లో మరోసారి హనుమకొండ బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న ఇద్దరు మహిళల మెడల్లో, సైడు బ్యాగులో బంగారు ఆభరణాలను చోరీ చేశారు. వరుస చోరీలపై అప్రమత్తమైన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో చోరీ చేసిన సొత్తును విక్రయించడానికి హనుమకొండ టైలర్స్‌ స్ట్రీట్‌ నుంచి వెళ్తుండగా పెట్రోలింగ్‌ నిర్వహిస్తున్న పోలీసులకు ఈ దంపతులపై అనుమానం వచ్చింది. తనిఖీ చేయగా బంగారు ఆభరణాలు లభించాయి. దీంతో అదుపులోకి తీసుకుని విచారించగా చోరీ చేసినట్లు అంగీకరించడంతో అరెస్ట్‌ చేసినట్లు ఏసీపీ తెలిపారు. హనుమకొండ ఇన్‌స్పెక్టర్‌ సతీశ్‌, ఎస్సైలు అశోక్‌ కుమార్‌, కిశోర్‌, ఏఎ సల్మాన్‌పాషా, హెడ్‌ కానిస్టేబుళ్లు నారాయణ, రాహుఫ్‌, కానిస్టేబుళ్లు మహేశ్‌, అశోక్‌, వీరన్న,భాస్కర్‌ను ఏసీపీ అభినందించారు.

కడుపు కోత మిగిల్చారు..

వేర్వేరు కారణాలతో ఉమ్మడి వరంగల్‌ జిల్లాలో నలుగురు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. తెలిసితెలియని వయసుతోపాటు కుటుంబీకులు మందలించారని, తమ ఇష్టాలకు అడ్డు చెప్పారనే కారణంతో క్షణికావేశంలో బలవన్మరణాలకు పాల్పడి కన్న వారికి కడుపు కోత మిగిల్చారు. ఈ ఘటనలతో ఆయా కుటుంబాలు శోకసంద్రంలో మునిగాయి.

తిన్న ప్లేట్‌ కడగలేదని తల్లి మందలించడంతో..


శ్రావణి(ఫైల్‌)

కురవి: తిన్న ప్లేట్‌ కడగలేదని తల్లి మందలించడంతో క్షణికావేశానికి గురైన కూతురు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై సతీశ్‌ కథనం ప్రకారం.. కురవి మండలం నేరడ శివారు కాకులబోడు తండా గ్రామానికి చెందిన బానోత్‌ వెంకన్న కుమార్తె శ్రావణి (14) తొమ్మిదో తరగతి చదువుతోంది. ఈనెల 17వ తేదీన భోజనం చేసిన ప్లేట్‌ కడగలేదని తల్లి సరిత.. శ్రావణిని మందలించింది. దీంతో మనస్తాపం చెందిన శ్రావణి పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. గమనించిన తల్లిదండ్రులు అదే రోజు మహబూబాబాద్‌ జనరల్‌ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని ధరణి ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీశ్‌ సోమవారం తెలిపారు. కాగా, శ్రావణి మృతితో కుటుంబంతోపాటు తండాలో విషాదం అలుముకుంది.

ప్రేమించిన యువతితో పెళ్లి చేయడం లేదని యువకుడు..


భరత్‌ (ఫైల్‌)

మొగుళ్లపల్లి : ప్రేమించిన యువతితో తనకు పెళ్లి చేయడం లేదనే కారణంతో కుటుంబ సభ్యులతో గొడవపడిన ఓ యువకుడు.. పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన సోమవారం జయశంకర్‌ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం మొట్లపల్లిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సంగ భరత్‌కుమార్‌ (20) ఓ యువతిని ప్రేమిస్తున్నానని, ఆమెతోనే పెళ్లి జరిపించాలని తండ్రితో మూడు రోజుల నుంచి గొడవ పడుతున్నాడు. అయితే తల్లి సంవత్సరీకం కాగానే పెళ్లి విషయంపై మాట్లాడుదామని చెప్పినా వినకుండా ఆదివారం రాత్రి వ్యవసాయబావి వద్దకు వెళ్లి పురుగుల మందు తాగానని కుటుంబీకులకు సమాచారం ఇచ్చాడు. వెంటనే చికిత్స నిమిత్తం వరంగల్‌ ఎంజీఎం తరలించగా అదేరాత్రి మృతి చెందాడు. మృతుడి తండ్రి కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్‌ తెలిపారు.

ప్రేమ విఫలమై మరో యువకుడు..

కాటారం : ప్రేమ విఫలమై ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం మహాముత్తారం మండలం సింగారంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వాసం మహేశ్‌(24) కొన్ని సంవత్సరాలుగా వాజేడు మండలం ముళ్లకట్ట రాంపూర్‌కు చెందిన ఓ యువతిని ప్రేమించాడు. కొన్ని రోజుల క్రితం యువతి ప్రేమ విషయం ఇంట్లో తెలపగా కుటుంబ సభ్యులు పెళ్లికి ఒప్పుకోలేదు. ఈ విషయం సదరు యువతి మహేశ్‌కు తెలపడంతో మనోవేదనకు గురై ఈ నెల 16న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు వరంగల్‌ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి సోదరుడు ఉపేందర్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేందర్‌కుమార్‌ తెలిపారు.

నెల్లుట్లలో ఎనిమిదో తరగతి విద్యార్థి..


లక్ష్మణ్‌ మృతదేహం

లింగాలఘణపురం : మండలంలోని నెల్లుట్లకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి దీకొండ లక్ష్మణ్‌ (13) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్తుల కథనం ప్రకారం..లక్ష్మణ్‌తో పాటు మరో నలుగురు స్నేహితులు కలిసి బడికి వెళ్లేవారు. సోమవారం ఓ స్నేహితుడి ఫోన్‌ తన వద్దే పెట్టుకొని, తాను చనిపోతానంటూ మిగతా స్నేహితులకు మెసేజ్‌లు చేసినట్లు సమాచారం. దీంతో ఓ స్నేహితుడు ఫోన్‌ చేస్తే ఎంతకూ లక్ష్మణ్‌ లిఫ్ట్‌ చేయకపోవడంతో ఇంటికి వచ్చి చూడగా ఉరేసుకుని కనిపించాడు. వెంటనే అతడు కుటుంబ సభ్యులకు తెలిపాడు. లక్ష్మణ్‌ మృతితో తల్లిదండ్రులు దీకొండ లక్ష్మి, సత్తయ్య రోదనలు మిన్నంటాయి. కాగా, లక్ష్మణ్‌ ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

జాతీయస్థాయి జిమ్నాస్టిక్స్‌ పోటీలకు ఎంపిక

వరంగల్‌ స్పోర్ట్స్‌ : కోల్‌కతాలోని సాల్ట్‌ లేక్‌ స్టేడియంలో ఈ నెల 28నుంచి 30వ తేదీ వరకు జరగనున్న ఆల్‌ ఇండియా పాఠశాల క్రీడల సమాఖ్య జిమ్నాస్టిక్స్‌ పోటీలకు కందికొండ దేవకి ఎంపిక కాగా హనుమకొండ డీవైఎస్‌ఓ గుగులోత్‌ అశోక్‌కుమార్‌ సోమవారం అభినందించారు. ఇటీవల హైదరాబాద్‌ సరూర్‌ నగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్‌ పోటీల్లో దేవకి ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికై ంది. దేవకిని ఎస్‌జీఎఫ్‌ జిల్లా కార్యదర్శి దస్రూ నాయక్‌, జిమ్నాస్టిక్స్‌ కోచ్‌ నరేందర్‌ తదితరులు అభినందించారు.


దేవకికి స్వీటు తినిపిస్తున్న అశోక్‌కుమార్‌

రెండు కిలో మీటర్లు.. మూడున్నర గంటలు

మాదిగల్లో ఉత్తేజం నింపిన మహాప్రదర్శన

- డప్పుచప్పుళ్లు, పాటలతో కదం తొక్కిన కార్యకర్తలు
- వర్గీకరణను అడ్డుకుంటున్న వారిని ఎదుర్కోవాలి
- ఎమ్మార్పీఎస్‌ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ

హన్మకొండ: రెండు కిలో మీటర్లు.. మూడున్నర గంటలు.. హనుమకొండలో నిర్వహించిన లక్ష డప్పులు, వేల గొంతుకుల సన్నాహక మహాప్రదర్శన ఉత్తేజం నింపింది. సోమవారం హనుమకొండలోని వేయి స్తంభాల దేవాలయంలో ఎమ్మార్పీఎస్‌ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ, మాజీ ఎమ్మెల్యేలు అరూరి రమేశ్‌, కొండేటి శ్రీధర్‌, కవి, గాయకుడు మిట్టపల్లి సురేందర్‌, ఎమ్మెల్సీ తీన్మార్‌ మల్లన్న, ఎమ్మార్పీఎస్‌ నాయకులు, కళాకారులు పూజలు నిర్వహించి మధ్యాహ్నం 12.30 గంటలకు మహా ప్రదర్శన ప్రారంభించారు. వేయి స్తంభాల దేవాలయం నుంచి అంబేడ్కర్‌ విగ్రహం వరకు దాదాపు రెండు కిలో మీటర్ల దూరం మూడున్నర గంటల పాటు మహాప్రదర్శన సాగింది. దారి పొడవునా మంద కృష్ణతోపాటు, ఆయా పార్టీల నాయకులు, ఎమ్మార్పీఎస్‌ నాయకులు, కళాకారులు తరలివచ్చిన డప్పులు వాయిస్తూ, పాడుతూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ, నాయకులు, కళాకారులు.. అంబేడ్కర్‌ విగ్రహానికి పూలమాల వేసి నివాళుర్పించారు. ఈ ప్రదర్శన విజయవంతం కావడంతో ఎమ్మార్పీఎస్‌, ఎమ్మెస్పీ శ్రేణులతోపాటు మాదిగ జాతిలో ఆనందం నెలకొంది. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే లక్ష డప్పులు.. వేల గొంతుల మహా ప్రదర్శనకు కార్యోణ్ముకులయ్యారు. ఉమ్మడి వరంగల్‌ జిల్లా నుంచి 30 వేలకు పైగా తరలివెళ్లినున్నట్లు వక్తలు చెప్పారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ వర్గీకరణను అడ్డుకుంటున్న వివేక్‌ కుటుంబాన్ని ఎదుర్కోవాల్సిన బాధ్యత ప్రతీ మాదిగ బిడ్డపై ఉందన్నారు. ధర్మం, న్యాయం, సమాజం, పార్టీలు, ప్రధాన మంత్రితో సహా అందరుమాదిగల పక్షాన, వర్గీకరణకు అనుకూలంగా ఉన్నారన్నారు. సీఎం రేవంత్‌ రెడ్డి మాట నిలబెట్టుకుంటే ఆయనను శత్రువుగా చూడమన్నారు. అయితే వర్ధన్నపేట ఎమ్మెల్యేతో సహా మాల ఎమ్మెల్యేలు, ఎంపీలను చిత్తుగా ఓడిస్తామన్నారు. ఫిబ్రవరి 7న జరిగే లక్ష డప్పులు, వేల గొంతుల కార్యక్రమానికి ప్రతీ మాదిగ తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఉప ముఖ్యమంత్రి డాక్టర్‌ తాటికొండ రాజయ్య, ఎమ్మార్పీఎస్‌ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్‌ నరేశ్‌, ఆయా పార్టీలు, ఆయా సంఘాల నాయకులు, కవులు, కళాకారులు గోనె ప్రకాశ్‌ రావు, పృథ్వీరాజ్‌, నమిండ్ల శ్రీనివాస్‌, గిద్దె రాంనర్సయ్య, గంగ, వరంగల్‌ శ్రీనివాస్‌, ఏపూరి సోమన్న, దరువు ఎల్లన్న, రాంబాబు, అమూల్య, నలిగంటి శరత్‌, స య్యద్‌ ఇస్మాయిల్‌, మాట్ల తిరుపతి, బుర్ర సతీశ్‌, తదితరులు పాల్గొన్నారు.


మహాప్రదర్శనలో డప్పు కొడుతున్న మంద కృష్ణ మాదిగ


డప్పులతో సాగుతున్న మహాప్రదర్శన

వేయిస్తంభాల ఆలయంలో పూజలు

హన్మకొండ కల్చరల్‌ : ప్రదర్శనకంటే ముందుగా వేయిస్తంభాల దేవాలయాన్ని మంద కృష్ణ మాదిగ, ఎమ్మెల్సీ తీన్మార్‌ మల్లన్న, మాజీ ఎమ్మెల్యేలు అరూరి రమేశ్‌, కొండేటి శ్రీధర్‌, గాయకుడు మిట్టపల్లి సురేందర్‌ తదితరులు సందర్శించారు. రుద్రేశ్వర స్వామి వద్ద డప్పులు ఉంచి పూజలు చేశారు. ముఖ్యమంత్రి సీఎం రేవంత్‌రెడ్డి మనసు కరిగి ఎస్సీ వర్గీకరణ బిల్లును వెంటనే శాసన సభలో ఆమోదించేలా రుద్రేశ్వరుడు కరుణించాలని తాము కోరుకున్నామని తెలిపారు. ఆలయ ప్రధానార్చకులు ఉపేంద్రశర్మ వారికి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేసి మహాదాశీర్వచనం అందజేశారు.


ఆలయంలో డప్పుతో మంద కృష్ణ మాదిగ, ఎమ్మెల్సీ తీన్మార్‌ మల్లన్న, మాజీ ఎమ్మెల్యే రమేశ్‌ తదితరులు